ఇంతకూ యీ గొడవవల్ల తేలిందేమిటి? దేవునికోసం వెదకటం నిష్ప్రయోజనం. గొప్పవారి మెదడులోనూ, గ్రంథకర్తల పుస్తకాల్లోనూ మాత్రమే వారి చిన్నన మవుతుంది. ఈ ప్రదేశాల్లోనే వారు ప్రత్యక్ష మవుతుంటారు. చివరకు బోధిచెట్టుకింద నిం చోని, ఈ సంగతి గ్రహించి, ఒక్క నిట్టూర్పు విడిచి యీ విధంగా నిర్ణయించుకుంది సల్లమ్మాయి.

"దేవునికోసమై ఇంత ఆర్భాట మెందుకు? ఇంత వృథా కాలయాపన ఎందుకు? నేను పోవలసివచ్చినరోజు అతగాడే నన్ను వెతుక్కుంటూ వస్తాడు."

## సా ను భూ తి

ఒక కవి తన స్నేహితుడైన ధనవంతుని దగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు—"ఒక్క అయిదు రూపాయిలుంటే బదులిస్తావంటి. ఇంట్లో బియ్యంలేవు. గోలగావుంది" అడగలేక అడగలేక తల దించుతూ అడిగాడు.

"నా దగ్గర దమ్మిడీలేదు. డబ్బెక్కడనుంచి వొస్తుంది? నా పొట్లో వండుతూవుంటావా? అడిగితే నే నిస్తా ననుకున్నావా" అన్నాడు ధనవంతుడు.

"నా కెప్పు డిచ్చారు?"

"నువ్వు చనిపోయిన తర్వాత శిలావిగ్రహానికి ఇవ్వాలిగా? ఇప్పుడూ ఇచ్చి, అప్పుడూ ఇచ్చి నా కిదేపనా?" అన్నాడు ధనవంతుడు.

కవికి ఆరోజు రాత్రి కంట్లో బొమ్మలు కనిపించినై. తన భార్యాపిల్లలు తిండిలేక ఒక మూలన ఏడుస్తూవుంటే, ఒకపక్కన తన శిలావిగ్రహం తయారవుతూ వుంటుంది. ఆ శిలావిగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని దాతృత్వాన్ని, సహృదయాన్ని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతూ వుంటారు.